ఘనంగా ఫ్రూట్స్ డే

ఫ్రూట్స్ వేషధారణలో విద్యార్థులు

ప్రజాశక్తి-కడప అర్బన్: నగరంలోని నాగరాజుపేటలోని న్యూపీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఘనంగా ఫ్రూట్స్ డే నిర్వహించారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులు వివిధ పండ్ల వేశధారణలో వచ్చి అలరించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్‌పీర్, పులివెందుల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ధ్రువకుమార్‌రెడ్డి మాట్లాడారు. చిన్నారులకు ఆరోగ్యాకరమైన పండ్లను తినడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. వివిధ పండ్ల వేశా ధారణలో ఉన్న చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేధింపుల సుడిలో విద్యార్థినులు

- 30 రోజుల వ్యవధిలో ముగ్గురు బలి
- అన్నమయ్యలో ఇద్దరు, కడపలో ఒకరు
- విద్యార్థినుల తల్లిదండ్రుల్లో వణుకు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో విద్యార్థినుల ఆత్మ'హత్య'ల పరంపర కొనసాగుతోంది. ఇటీవలి 30 రోజుల వ్యవధిలో కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు వేధింపుల బారిన పడి హత్యాచారానికి గుర వడం, అనంతరం హత్యకు గురై ఘటనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. విద్యాభ్యాసం చేయడానికి కళాశాలలకు వెళ్లిన విద్యార్థినులు ప్రేమ పేరుతో వేసిన ఉచ్చులో పడడం, విహారాల పేరిట అటవీ, పర్యాటక, నదీతీర ప్రాంతాలకు వెళ్లిన అనంతరం ఆత్మహత్య, హత్యల పాలైన ఉదంతాలు తరుచుగా చోటుచేసుకోవడం తల్లిదండ్రుల్లో వణుకును పుట్టిస్తోంది.

జిల్లాలో మహిళల విద్యాభ్యాసం సవాలుగా మారింది. కడప జిల్లాలో 147 ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి. 34,272 మంది విద్యాబ్యాసం చేస్తున్నారు. 50 శాతం పైగా విద్యార్థినులు ఉన్నారు. వార్షిక ఫలితాల్లో పురుషులను అధిగమిస్తున్న తీరు పలువురిని విశేషంగా ఆకర్షిస్తోంది. తల్లిదండ్రులు విద్యార్థినులను ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లాలో ముగ్గురి విద్యార్థినులపట్ల చోటుచేసుకున్న లైంగిక వేధింపుల బారిన పడి అసువులు బాసిన నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది. ప్రతిరోజూ ఉదయం ఇంటి నుంచి కళాశాలలకు బయల్దేరిన విద్యార్థినులు తిరిగి ఇంటికి వచ్చే వరకు తల్లిదండ్రులు కళ్లల్లో ఒత్తులు వేసుకుని నిరీక్షించాల్సి కళాశాలలకు తీసుకెళ్లి విడిచివచ్చినప్పటికీ విద్యార్థినుల భద్రత పట్ల ఆందోళన తొలగడం లేదు. కళాశాలల భద్రత లోపమా..తల్లిదండ్రుల, పోలీసుల పర్యవేక్షణల్లో లోపమా అనే అంశం వెయ్యి డాలర్ల ప్రశ్నగా మారింది.

30 రోజులు.. ముగ్గురు ఆత్మ'హత్య'?

ఈ ఏడాది జూన్ 10 నుంచి జులై 15 నాటికి 35 రోజుల వ్యవధిలో ముగ్గురు విద్యార్థినులు లైంగిక వేధింపుల బారిన పడిన ఉదంతాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2018లో కడప జిల్లా గోపవరం మండలానికి చెందిన ఓవిద్యార్థిని పెన్నానది సమీపంలో విగతజీవిగా కనిపించడం తెలిసిందే. 2024లో బద్వేల్ పట్టణ సమీ పంలోని అటవీ ప్రదేశంలో హత్యా చారం ఆపై పెట్రోల్ పోసి నిప్పంటించిన వైనం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనాన్ని కలిగించింది.

ఈ ఏడాది జూన్ 10న మదనపల్లిలోని మంజునాథ కాలనీకి చెందిన మస్తాని, జూన్ 24న మదనపల్లి పట్టణం గొల్లపల్లికి చెందిన శృతి అనే విద్యార్థి ప్రేమ పేరుతో వేధింపుల బారినపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఉదంతం చర్చనీయాంశంగా మారింది. తాజాగా కడప జిల్లాలో గండికోట పర్యాటక ప్రదేశంలో ఓ విద్యార్థిని హత్యకు గురికావడం కలకలం రేపుతోంది. హత్య, హత్యాచార ఘటనలు చోటుచేసుకున్న అనంతరం పోలీసులు రంగప్రవేశం చేయడం, కేసును పరిశోధించి కేసులు నమోదు చేయడంతో కథా సుఖాంతం కావడం పరిపాటిగా మారింది.

సోషల్‌మీడియా ప్రభావమెంతో?

ప్రపంచంలో విద్యకు ప్రాధాన్యత పెరిగిన సంగతి తెలిసిందే. ఉభయ జిల్లాలకు చెందిన విద్యార్థినులు అమెరికా, యుకె, కెనడా, ఇరాన్, పిలిప్పీన్స్, కజకిస్తాన్, చైనా తదితర దేశాలకు విద్యాభ్యాసానికి, ఉపాధి అవకాశాలకు వలసలు వెళ్తున్నారు. మరోవైపు కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఇంటర్ కళాశాలలకు విద్యాభ్యాసానికి వెళ్తున్న పలువురు విద్యార్థినులు అనారోగ్యకర వాతావరణంలో అసువులుబాస్తున్న విచిత్ర పరిస్థితి నెలకొంది. దీనికిగల కారణాల ఏమిటని మేధావులు, ఇంటలెక్షువల్స్, పోలీస్ వర్గాలను ఆరా తీస్తే కోవిడ్-19 అనంతరం సెల్‌ఫోన్ వినియోగం పెరిగిన నేపథ్యంలో నేర ప్రవృత్తి కోరలు చాచినట్లు విశ్లేషిస్తున్నారు. సోషల్ మీడియాలో వెల్లువెత్తే క్రైమ్ సీనపట్ల యువత ఆకర్షితులై నేరాలకు పాల్పడుతున్నారనే విశ్లేషణలు ఉన్నాయి. సినిమా, సోషల్‌మీడియా మాద్యమాల్లో నేరాల సీన్లలో తప్పించుకునే విధానాలను గమనించి హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోందనే విశ్లేషణలు ఉన్నాయి.

కీలక ఆధారాలు లభ్యం

- విద్యార్థిని హత్య కేసులో ప్రియుడి పాత్ర లేదు
- మృతురాలిపై అత్యాచారం జరగలేదు
- కర్నూల్ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ వెల్లడి

సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న కర్నూల్ రేంజ్ డిఐజి, ఎస్‌పి

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్/ఎర్రగుంట్ల

గండికోటలో ఇంటర్ విద్యార్థిని వైష్ణవి హత్య కేసులో ప్రియుడి పాత్ర లేదని కర్నూల్ రేంజి డిఐజి కోయ ప్రవీణ్ తెలిపారు. బుధవారం విద్యార్థిని హత్యపై డిఐజి ప్రవీణ్ ఎస్‌పి అశోక్ కుమార్, జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వరరావులతో కలిసి దాల్మియా సిమెంట్ పరిశ్రమలోని పోలీసు గెస్ట్‌హౌస్, గండికోటలోని హరిత టూరిజంలో చర్చించారు. అనంతరం విద్యార్థిని తిరిగిన ప్రదేశాలను, మృతదేహం ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం పర్యాటక ప్రాంతమైన గండికోటలోని రంగనాథస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిజిపి ప్రవీణ్ మాట్లాడుతూ గండికోటలో మంగళవారం ఉదయం మృతదేహమై కనిపించిన వైష్ణవి కేసును ఛేదించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం మొత్తం ఇక్కడే తిష్టవేసి విచారిస్తున్నారన్నారు. సోమవారం విద్యార్థిని ప్రియుడితో కలిసి గండికోటకు ఉదయం 8 గంటలకు వచ్చిందన్నారు. 10.40 గంటలకు ప్రియుడు లోకేష్ విద్యార్థినిని అక్కడే వదిలి పోయాడని తెలిపారు. 11 గంటలకు విద్యార్థిని రంగనాథస్వామి దేవాలయం వద్ద బ్యాగుతో తిరిగినట్లు పోలీసులు సమాచారాన్ని రాబట్టారన్నారు. ఆ తర్వాత ఏమి జరిగందనే దానిపై బుధవారం ఉదయం కీలక సమాచారం వచ్చిందన్నారు. విద్యార్థినిపై లోకేష్ కానీ లేదా ఇతరులు కానీ ఎలాంటి అత్యాచారం చేయలేదన్నారు. విద్యార్థిని కేసు పూర్తిగా ఛేదించామని తెలిపారు. తనకు సిఎం కార్యక్రమం ఉండటం వలన చెప్పలేక పోతున్నానని సాయంత్రం ఎస్‌పి లేదా డిఎస్‌పి వెల్లడిస్తారని తెలిపారు. విద్యార్థిని వివస్త్రగా చెట్ల పొదల్లో పడేయడం చాలా బాధాకరం, దుర్మార్గపు చర్యన్నారు. సమావేశంలో జమ్మల మడుగు అర్బన్ సిఐ లింగప్ప, భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

హత్యకు గురైన విద్యార్థినికి అంత్యక్రియలు : గండికోటలో హత్యకు గురైన విద్యార్థిని వైష్ణవి అంత్యక్రియలు ఎర్రగుంట్ల మండలంలోని హనుమనగుత్తిలో కుటుంబ నిర్వహించారు. తల్లిదండ్రుల, బంధువుల రోధనలు మిన్నంటాయి.

నిందితుడిని శిక్షించాలి : ఐద్వా

ప్రొద్దుటూరు : గండికోటలో విద్యార్థినిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా నాయకులు గురమ్మ, రమాదేవి అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ ఆఫీస్ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మహిళల పైన దాడులు విపరీతంగా జరుగుతున్నాయని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి వైష్ణవిని ఎవరు హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీదేవి, ఝాన్సీరాణి, విజయ కుమారి, కళావతి, మేరీ, నీతమ్మ, అన్నపూర్ణ, విజయ్ కుమార్, సాల్మన్, రాఘవ, నాగేంద్ర పాల్గొన్నారు. **కడప అర్బన్ :** వైష్ణవి హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సిఐటియు కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, బి.మనోహర్, కోశాధికారి లక్ష్మీదేవి, ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐ.ఎన్.సుబ్బమ్మలు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మాయిలను చంపడం, హత్యాచారాలు చేయడం, దారుణానికి పాల్పడడం పరిపాటిగా మారిందని తెలిపారు. హోం మంత్రి స్పందించి హత్య చేసిన వారినిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బుగ్గవంకపై వంతెన నిర్మించాలి : డిసిసి

ప్రజాశక్తి - కడప

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

బుగ్గవంకపై బ్రిడ్జి వెంటనే నిర్మించాలని, లేనిపక్షంలో నిరాహార దీక్షలు చేపడతామని డిసిసి జిల్లా అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి హెచ్చరించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ప్రతిరోజు 50 వేల మంది నుంచి 60 వేల మందికి ఉపయోగపడే వంతెనల నిర్మాణం తొందరగా పూర్తి చేయాలన్నారు. రవీందర్‌నగర్‌లో వంతెన కూల్చడం వల్ల అక్కడి ప్రాంత ప్రజలు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్న సమయంలో ఈ వంతెనను పునర్నిర్మిస్తామని హామీతో కూల్చివేసి తర్వాత నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్‌పీర్, పులివెందుల నియోజకవర్గం కో-ఆర్డినేటర్ ధ్రువకుమార్‌రెడ్డి, మాజీ రాష్ట్ర కార్మిక సంఘం చైర్మన్ పుల్లయ్య, నాయకులు అమీద్, యూసఫ్, హరిప్రసాద్, పుల్లూరుబాషా, సుల్తాన్ మొహిద్దీన్, సిద్ధిక్, షామీర్, జహూర్ అహ్మద్, సయ్యద్ హుస్సేన్, కమాల్‌బాషా పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ

ప్రజాశక్తి - కడప: కడప నగరాభివృద్ధి వైసిపితోనే సాధ్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం కడప నగరంలోని 27వ డివిజన్‌లో కో-ఆప్షన్ సభ్యులు జహీర్, కార్పొరేటర్ ఆరిఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 15వ ఫైనాన్స్ నిధులతో చేపట్టిన రోడ్డు పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలల అవుతున్న కడప నగరంలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమాలకు నోచుకోలేదన్నారు. మాటల ప్రభుత్వమే కానీ చేతల ప్రభుత్వం కాదన్నారు.

ఘనంగా 'శ్రీసాయి'లో స్వాగతోత్సవం

ప్రజాశక్తి-కడప అర్బన్ : శ్రీసాయి జూనియర్ కళాశాల స్వాగతోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి. బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఐఒ వెంకటసుబ్బయ్య హాజరై మాట్లాడుతూ బాలికలు నేడు అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. అనేక విధాలుగా అందుబాటులో ఉన్న ఫోన్స్, ఇతరత్రా కారణాల వల్ల కొంతమంది విద్యార్థులు చెడు వ్యసనాలకులోనై నిండు నూరేళ్ల జీవితాలను దెబ్బతీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరస్పాండెంట్ పి.రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ఎంతో క్రమశిక్షణతో, అద్భుతమైన ప్రణాళికతో ముందుకెళ్తూ జూనియర్ ఇంటర్లో 470కి 466 మార్కులు, సీనియర్ విభాగంలో 981/1000 మార్కులు విద్యార్థులు సాధించారని చెప్పారు. ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు అందించామని పేర్కొన్నారు. డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రణాళిక యుక్తంగా చదివితే తప్పక ర్యాంకు సాధించలేరని చెప్పారు. ప్రిన్సిపల్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ అమ్మాయిలు నేటి పోటీ రంగంలో ముందు వరుసలో ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గాయపడిన వారికి గ్రామస్తుల చేయూత

ప్రజాశక్తి-కాశినాయన

మండల మండల పరిధిలోని ఉప్పలూరు గ్రామంలో మొహరం చివరి రోజున గుండం పూడుస్తుండగా అగ్ని నిప్పులు పడి దాదాపు పది మందికి గాయాలయ్యాయి. వారిని గ్రామ ప్రజలు ఆర్థికంగా ఆదుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఉప్పలూరు గ్రామంలో ఇటీవల పీర్ల పండుగ సందర్భంగా గుండం పూడుస్తుండగా అగ్ని నిప్పులు పడి దాదాపు 11 మందికి కాళ్లు, చేతులు కాలడంతో తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. గాయాలైన వారు కడప రిమ్స్‌లో చికిత్స పొంది వారి స్వగృహాలకు వచ్చారని తెలిపారు. గాయపడిన వారికి చేయూతగా ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున సాయం చేశామన్నారు. గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలన్నారు. కార్యక్రమంలో రజినీకాంత్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పోలిరెడ్డి, గురప్ప, ఎం.రమణారెడ్డి, సోమయ్య, సత్యనారాయణరెడ్డి, రాజారెడ్డి, ఆదినారాయణరెడ్డి, కొండారెడ్డి, రోషిరెడ్డి, వీర నారాయణరెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం : జిల్లా జడ్జి

ప్రజాశక్తి - కడప

మధ్యవర్తిత్వంతో కక్షిదారుల సమస్యలను పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై వన్ కే వాక్ నిర్వహించారు. కడప న్యాయ సేవా సదన్ నుండి అంబేద్కర్ సర్కిల్ కూడలి వరకు నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించి జిల్లా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వంతో కక్షిదారులకు తమ సమస్యలను తానే పరిష్కరించుకునే అవకాశాన్ని కల్పించే ప్రక్రియ అని తెలిపారు. కార్యక్రమంలో 4, 6, 7వ అదనపు జిల్లా జడ్జిలు గరికపాటి దీనబాబు, ఎన్.శాంతి, జి.రమేష్ కుమార్, సీనియర్ సివిల్ జడ్జి ఫక్రుద్దీన్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి జి.సి.ఆసిఫా సుల్తానా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి భార్గవి, 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.ఈశ్వర్ వెంకట ప్రసాద్, 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.విజయలక్ష్మి, కడప బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాఘవరెడ్డి, చంద్రవదన పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి యామిని

భూ కబ్జాలపై ప్రజా ఉద్యమం

- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు

మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరంలో ప్రభుత్వ భూములు, స్థలాలను ప్రయివేటు వ్యక్తుల కబ్జాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైందని, రానున్న కాలంలో ప్రజా ఉద్యమం నిర్మించాలని అఖిలపక్ష పార్టీ నేతలు నిర్ణయించారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో భూకబ్జాలు, కాలువల, శ్మశానాల ఆక్రమణలపై అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రామమోహన్, ఎపిసిసి నాయకులు సత్తార్, బిఎస్‌పి నాయకులు సగిలి గుర్రప్ప, సిపిఐ నాయకులు ఆర్.బాబు, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి సుబ్బారాయుడు, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, ఆర్‌ఎంపిఎల్ నాయకులు రమణయ్య, ఎంసిపిఐయు నాయకులు నాగేంద్ర, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నాసిర్ హుస్సేన్, లోక్‌సత్తా నాయకులు శ్రీకృష్ణదేవరాయలు, ఆప్ నాయకులు శ్రీనివాసులు, ఆర్‌సిపి నగర కార్యదర్శి మాగ్బుల్ హుస్సేన్, లిబరేషన్ నాయకులు ఓబయ్య, డబ్ల్యూ రాము, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, మహిళా సంఘం నేత సుబ్బమ్మ, పెన్షనర్ సంఘం నేత రామకృష్ణారెడ్డి, నగర అభివృద్ధి వేదిక కన్వీనర్ కుమారస్వామిరెడ్డి, కెవిపిఎస్ నగర కన్వీనర్ నరసింహ మాట్లాడారు. వైసిపి, టిడిపి నేతలు కుమ్మక్కై నగరంలో ఉన్న ప్రభుత్వ భూములన్నీ ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టి, రియల్ ఎస్టేట్ వ్యాపా రానికి సహకరిస్తున్నారని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకున్న వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలో 700 ఎకరాలు ప్రభుత్వ భూమి ప్రయివేట్ వ్యక్తుల పేర్లతో బదలాయింపు జరిగిందని, దీని మీద సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కబ్జాకు కావేవి అనర్హం అన్నట్లు శ్మశానాలు, కాలువలు, వంకలు ఆక్ర మించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయటం వల్ల భవిష్యత్తులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. జర్నలిస్ట్ కాలనీలో కాలువ ఆక్ర మించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, ఆ కాలువను యధాతథంగా నీటి ప్రవాహం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. భూకబ్జాదారులకు రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు పెద్ద ఎత్తున సహకారం అందించడం వల్లనే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. కడపను కబ్జాదారుల కబంధ హస్తాల నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ 30వ తేదీన అంబేద్కర్ సర్కిల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాలని అఖిల పక్షం నిర్ణయించిందని వారు తెలిపారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని, ఇందులో ప్రజానీకం పెద్ద ఎత్తున భాగస్వాములయ్యేలా కృషి చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సమావేశంలో సిపిఎం నాయకులు చంద్రారెడ్డి, జిలాన్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి : ఇన్‌ఛార్జి కలెక్టర్

రెవెన్యూ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ పథకాల అమలులో, అర్జీల పరిష్కారంలో కింది స్థాయి అధికారులు నిర్లక్ష్యం వీడి పనితీరు మెరుగుపర్చుకుని బాధ్యతాయుతంగా, జవాబదారితనంతో పనిచేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ సమావేశ హాల్లో విఆర్‌ఒలు, సచివాలయ అడ్మిన్స్ వెల్ఫేర్ సెక్రటరీలు, మండల గ్రామ సర్వేయర్లతో ఐవిఆర్‌ఎస్‌లో వచ్చిన ఫీడ్ బ్యాక్ నివేదికల పనితీరుపై డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడుతో కలిసి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సేవలలో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. ఏలాంటి సమస్య అయినా కాలయాపన చేయకుండా వేగంగా స్పందించి చర్యలు చేపట్టి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలు, పథకాలపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారా లేదా అనే అంశాలపై మనోభావాలను సేకరిస్తోందని తెలిపారు. మూడు ప్రశ్నలు ఉన్నాయని అవి అధికారులు అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారా, అధికారులు నోటీసులు జారీ చేశారా, దరఖాస్తును పరిశీలించి ఫీల్డ్ విజిట్ చేశారా అన్న అంశాలపై ఇప్పటివరకు ఐవిఆర్‌ఎస్ ద్వారా సేకరించిన ఫీడ్ బ్యాక్‌లలో పనితీరు మెరుగ్గా లేనివారిని గుర్తించి పిలిచారన్నారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ అధికారి మురళీకృష్ణ, మున్సిపల్ కార్పొరేషన్ అడి షనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, జడ్‌పి డిప్యూటీ సిఇఒ సుబ్రమణ్యం, తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్‌ఒలు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే పక్కాగా చేయాలి

జిల్లాలో భూ రీసర్వేను పక్కాగా నిర్వహించాలని మండల, గ్రామ స్థాయిలో తహశీల్దార్లు సర్వేయర్లు, విఆర్‌ఒలను ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. బుధవారం విజయవాడ నుండి భూముల రీ సర్వే, రెవెన్యూ సమస్యలు తదితర అంశాలపై అదనపు సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి నక్కల ప్రభాకర్‌రెడ్డితో అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. విసిలో రాష్ట్ర రెవెన్యూ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ మాట్లాడుతూ భూముల రీ సర్వే, రెవెన్యూ సమస్యల వల్ల ఏ ఒక్కరు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, పేదలందరికీ ఇల్లు వంటి పథకాలకు అనర్హులు కాకూడదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందాలన్నా ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రతి ఒక్కరు నిబద్ధతతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాల్లో భూముల రీసర్వేపై ప్రత్యేక శ్రద్ధ వహించి పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సిసిఎల్ఎ వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కడప కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలు ఎక్కడా కూడా పెండింగ్ లేకుండా చూడాలన్నారు. జిల్లాలో ఫేజ్ 1లో ఉన్న భూముల రిసర్వే వేగవంతంగా, పకడ్బందీగా ఈ నెలాఖరి లోపల పూర్తి చేయాలన్నారు. భూముల రిసర్వే లో రెవెన్యూ, సర్వే ల్యాండ్ శాఖల అధికారులు నేరుగా రైతుల వద్దకే వెళ్లి క్షేత్రస్థాయిలో రికార్డులను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి తప్పనిసరిగా వ్యవసాయ అధికారులు ఆధార్ అప్డేషన్ చేయాలని ఆదేశించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐ.ఎన్.సుబ్బమ్మ

ప్రజాశక్తి-కడప అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల నిరసనకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలిజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ 36 ప్రకారం రూ.21 వేలు, రూ.24,500 ఇవ్వాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని తెలిపారు. ఉద్యోగ భద్రత లేకుండా చేయడానికి, సంక్షేమ పథకాలు అమలు వర్తించకుండా చుసి కార్మికుల "శ్రమ దోపిడీ పీడనను పెంచారని" విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం, విద్యా, వైద్యం, ఉపాధి హక్కు, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల జాబితాలో చేర్చాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, శ్రామిక ప్రజలందరూ ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నూటికి 90 శాతం ప్రజల్లో కొనుగోలు శక్తి బాగా పడిపోయిందని, వారికి వస్తున్న స్వల్ప వేతనాలు వారి ఆర్థిక కడగండ్లను తీర్చలేకున్నాయని అందుచేతే కార్మిక పోరాటాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం ప్రజలపై మోయలేని పన్నుల భారాలు వివిధ రూపాలలో వేస్తున్నారని, ప్రజా ఉద్యమాలు భవిష్యత్తులో రాబోతున్నాయని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, మనోహర్, ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐ.ఎన్.సుబ్బమ్మ, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్, కోశాధికారి గోపి, ఉపాధ్యక్షులు తిరుపాలు, సహాయ కార్యదర్శి ఆనందరావు, బ్రహ్మానందరెడ్డి, నగర అధ్యక్ష, కార్యదర్శులు సుంకర రవి, కేశవులు, శ్రీరామ్, కిరణ్, విజయ్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచి ప్రభుత్వ అధికారులకు ఇచ్చే అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేసి, వారికి కేడర్ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల నిరసనకు తులసిరెడ్డి మద్దతు

ప్రొద్దుటూరు : కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి కోరారు. కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపిన ఆయన మాట్లాడుతూ మనిషి బతికేందుకు మంచినీరు, నాణ్యమైన విద్యుత్తు, పారిశుధ్యం ఎంతో అవసరమన్నారు. నిత్యం అవసరమైన వాటికోసం కార్మికులు తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. తమ అవసరాలను తీర్చుకునేందుకు కార్మికులు సమ్మె చేస్తుండడంతో ప్రజాజీవనం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ కార్మికుల సమస్యల గురించి పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సిఐటియు పట్టణ కార్యదర్శి బిరు విజయకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు షేక్ పూల నజీర్,జమ్మలమడుగు కాంగ్రెస్ నాయకులు పాముల బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ కార్మిక సంఘ అధ్యక్షులు చంటి, కార్యదర్శి సాల్మన్, ప్రభుత్వ ఆసుపత్రి కార్మిక సంఘ నాయకులు రాఘవ, మహిళ కార్మిక సంఘ నాయకులు ముంతాజ్ సర్వేశ్వరి సుబ్బమ్మ పాల్గొన్నారు.

ఎరువుల తయారీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కడప సిటీ

మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల హోల్ సేల్ దుకాణాలు, ఎరువుల తయారీ కేంద్రాలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి మల్లికార్జునరావు, కర్నూల్ డిఆర్‌సి ఎడిఎ సంగు వెంకటేశ్వర్లు, జెడిఎ కార్యాలయ టెక్నికల్ ఎఒ ఎస్.గోవర్ధన్, మండల వ్యవసాయ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో రిజిస్టర్లు తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా రాసి ఉంచుకోవాలని డీలర్లను హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన, అనుమతి కలిగిన వాటిని మాత్రమే రైతులకు విక్రయించాలని పేర్కొన్నారు. ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం అనుసరించి వ్యాపార లావాదేవీలు కొనసాగించాలన్నారు. డిబిటి మిషన్ ద్వారా రైతుల వివరాలు నమోదు చేసి రైతులకు ఎరువులు విక్రయించాలని చెప్పారు. దుకాణాల్లో ఉన్న స్టాక్ నిల్వలను పరిశీలించి, పారం ఒలు అనుమతి కలిగి ఉన్నాయా లేదా అలాగే కాలం చెల్లిన ఉత్పత్తులు ఏమైనా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. సక్రమంగా రికార్డులు నిర్వహించని 32 లక్షల విలువ గల ఎరువులకు స్టాప్ సేల్స్ ఇవ్వడం జరిగింది. రైతులకు అమ్మిన ప్రతి వాటికి నగదు బిల్లు అందించి డీలర్ దగ్గర కూడా ఒక బిల్లు ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీత ధరలకు మాత్రమే ఉత్పత్తులను రైతులకు విక్రయించాలన్నారు. ప్రతి రోజు స్టాక్ బోర్డ్, ధరల పట్టికను అప్డేట్ చేసి ఉంచాలని తెలిపారు. లైసెన్సులు లేకుండా వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గోడౌన్‌లో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

భద్రతా నియమాలు పాటించండి : ఎస్ఇ

ప్రజాశక్తి - కడప

భద్రత నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ అన్నారు. అంతరాయాలు జీరో చేయాలని సూచించారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలపై తక్షణం స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. బుధవారం కడప ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ప్రాంతంలో సబ్‌స్టేషన్లు, లైన్లు, ట్రాన్స్‌ఫార్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు అనంతరం రూరల్ సబ్ డివిజన్ విభాగం సిబ్బంది, అధికారులతో కడప డివిజనల్ విద్యుత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల మందికి ఉపాధి కల్పించే పారిశ్రామికవాడలో ఒక్క అంతరాయం ఏర్పడిన ఉత్పత్తి అనుకున్నంత మేర పొందలేరన్నారు. పరిశ్రమలు ఎంతోమందికి జీవన ఉపాధి కల్పిస్తున్నాయి, పరిశ్రమలు బాగుంటే ప్రజలు బాగుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప డిఇఇలు హరిసేవ్యానాయక్, సుబ్రహ్మణ్యం, రామచంద్రరెడ్డి, ఎఇలు, అకౌంట్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

విద్యార్థులు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి

ప్రజాశక్తి - దువ్వూరు

బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ విద్యార్థులను కోరారు. మండలంలోని పుల్లారెడ్డిపేట కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో రూ. 37 లక్షల నిర్మించిన సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌ను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులు క్రమశిక్షణగా ఉండడం, ఉపాధ్యాయులు చక్కటి చదువును చెప్పడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలకు సిసి రోడ్డు, కాంపౌండ్ తదితర సౌకర్యాలను చేయాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి తర్వాత బాలికలు ఇంటర్మీడియట్ కూడా ఇక్కడే చదివేందుకు సౌకర్యంగా కాలేజీని ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణ, కస్తూర్బా పాఠశాల సిబ్బంది, టిడిపి దువ్వూరు మండల అధ్యక్షులు బోరెడ్డి రమణారెడ్డి, పట్టణ ఇన్‌ఛార్జి పాపినేని రాంబాబు, పోలు మోహన్ రెడ్డి, శెట్టి నాగరాజు, అందే శ్రీనివాసులు పాల్గొన్నారు

అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం ఆవరణలో ఆషాడ మాసం శుక్రవారం సందర్భంగా భద్రకాళి అమ్మవారి శాకంబరీ అలంకరణ చేపట్టేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, ఇఒ శ్రీనివాసులు మాట్లాడుతూ భద్రకాళి అమ్మవారిని ఆషాడ మాసం సందర్భంగా శాకాంబరి అలంకరణలో దర్శనం ఇవ్వనున్నారు. పంచామృతాభిషేకం, గణపతి పూజ, మంగళహారతి, సామూహిక కుంకుమార్చ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అగ్రహారం సహకార సంఘం ప్రమాణం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడిగా త్రిపురవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు హరినాథ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో సహకార సంఘం అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు పలువురు కలిసి అభినందనలు తెలిపారు. మైదుకూరు నియోజకవర్గం, ఖాజీపేట ఐటిడిపి అధ్యక్షులు రాము యాదవ్, చిత్రాల ఏసుపాదం సహకార చైర్మన్ హరినాథ్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. సహకార సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని హరినాథ్‌రెడ్డి తెలిపారు.

గండికోటలో నిరంతర పర్యవేక్షణ ఉండాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

ప్రపంచ పర్యాటక ప్రాంతమైన గండికోటలో అధికారులు, పోలీసు యంత్రాంగం పటిష్ట పర్యవేక్షణ, నిఘా, పెట్రోలింగ్ వంటివి చేపట్టాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థిని హత్య నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ పర్యాటక ప్రాంతమైన గండికోటకు ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు వస్తువుంటారన్నారు. గండికోట కొంతకాలంగా అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా ఉందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డివైఎఫ్ఐగా కోరుతున్నామన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, కృష్ణారెడ్డి, అరుణ్ పాల్గొన్నారు

డిగ్రీ ప్రవేశాలు వెంటనే చేపట్టాలి

- డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్న డిగ్రీ ప్రవేశాలు ప్రారంభించకపోవడం పట్ల డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శి మేరీ కుమార్, విశ్వనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా బుధవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ తక్షణమే డిగ్రీ ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో గత ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలపై ప్రతిపక్షంలోని కూటమి పార్టీలు అప్పట్లో విమర్శలు చేశాయని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు డిగ్రీ ప్రవేశాల ఆలస్యం చేయడం గర్హనీయమన్నారు. తెలంగాణతో పాటు మన పొరుగు రాష్ట్రాల్లో సైతం నెలరోజులు క్రితం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. మన రాష్ట్రంలో ఆలస్యం కావడంతో డిగ్రీ చేరే విద్యార్థుల సంఖ్య తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పష్టమైన విధానాలతో డిగ్రీ ప్రవేశాలు ప్రారంభించాలని వారు కోరారు.

రక్తదాన శిబిరం విజయవంతం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : శివాలయం సర్కిల్‌లో ద్వితీయ వార్షికోత్సవ రక్తదాన వారోత్సవాలు సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఉద్యోగులు, వ్యాపారస్తులు, విద్యార్థులు స్వచ్ఛందంగా ప్రభుత్వ ఆసుపత్రికి 52 యూనిట్ల రక్తాన్ని అందజేశారు. రక్తదాన శిబిరానికి మున్సిపల్ కమిషనర్ రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎంపిపి మల్లెల రాజారాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా, సీమాంధ్ర బి.సి సంక్షేమ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్, గుర్రం దేవేందర్‌రాజ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సహకరించిన దాతలకు, పాత్రికేయులకు స్వచ్ఛంద సేవా సంస్థల కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

లింగాల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని, పిల్లలకు వేసే భోజనం నాణ్యత, రుచిగా ఉండాలని మండల విద్యాశాఖాధికారి రామకృష్ణయ్య వంట సిబ్బందిని ఆదేశించారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం పాఠశాలల్లో పనిచేసే వంట సిబ్బందికి ఒక్క రోజు శిక్షణలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం రోజు వారి మెనూ ఉండాలన్నారు. పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడాలన్నారు. ఎప్పటికి అప్పుడు వంట పాత్రలు, వంట గదులు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బంది, ఆయాలు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం శాంతియుత పరిష్కార మార్గం

జమ్మలమడుగు రూరల్ : మధ్యవర్తిత్వం అనేది న్యాయ వ్యవస్థలో ఒక శాంతియుత పరిష్కార మార్గమని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి తెలిపారు. బుధవారం స్థానిక కోర్టు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ అవగాహన ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా ఇరు పక్షాల మధ్య వాదనలు తీర్చడం సులభమవుతుందన్నారు. న్యాయ ప్రక్రియను త్వరగా పూర్తిచేయడం సాధ్యమవుతుందన్నారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించడంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పాత్ర ఎంతో గొప్పదన్నారు.

నిబంధనల ప్రకారం క్లబ్బులు నిర్వహించాలి

పులివెందుల టౌన్ : పట్టణ పరిధిలోని క్లబ్బులను నిబంధనల ప్రకారం నిర్వహించాలని పట్టణ సిఐ చాంద్‌బాషా తెలిపారు. బుధవారం పట్టణ పరిధిలోని బాలికల పాఠశాల, ఆటోనగర్ సమీపంలో ఉన్న క్లబ్బులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా క్లబ్ నిర్వహిస్తే చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

కాలువల పరిస్థితి ఇలా.. నీరు పారేది ఎలా..!

కెసి కాలువ చివరి ఆయకట్టుకు నీరు చేరేందుకు ఆటంకాలు - కొనసాగుతున్న బ్రిడ్జి పనులు

మైదుకూరు వద్ద కొండపేట కాలువలో జరుగుతున్న సిమెంట్ కాంక్రీట్ పనులు

ప్రజాశక్తి - చాపాడు

శ్రీశైలం రిజర్వాయర్‌కు గతంలో ఎన్నడు లేని విధంగా ఎగువ ప్రాంతాల్లో పడుతున్న వర్షాలకు నిండుకుండలా మారింది. ఇప్పటికే రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం రావడంతో కిందకు నీటిని కూడా విడుదల చేశారు. శ్రీశైలం రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేయడంతో కెసి కాలువకు నీటిని విడుదల చేసే రాజోలి ఆనకట్టకు మూడు రోజుల క్రితమే నీరు చేరుకుంది. కెసి కాలువకు నీటిని విడుదల చేసేందుకు మైదుకూరు వద్ద పలు ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయి. దీనితో కేసి కాలువలపై పనులు వివిధ దశల్లో ఉండడంతో నీటిని విడుదల చేసేందుకు అనుమతులు లేవు. దీంతో నీటిని రాజోలు ఆనకట్ట నుండి కుందూనది దిగువకు వదిలారు. ప్రతి ఏడాది ఆగస్టు రెండో వారంలో నీటిని విడుదల చేసేవారు. స్థానికంగా వర్షాలు పడనప్పటికీ ఎగువ ప్రాంతాల్లో పడినందున ఊహించని విధంగా జులై 14న కెసి కాలువకు నీరు విడుదలకు చేశారు అయితే అధికారులు ముందుచూపు లేకపోవడంతో కెసి కాలువలపై పనులు కొనసాగుతున్నాయి. చాపాడు మండలం ఏటూరు కాలువపై బళ్లారి-నెల్లూరు ఫ్లై ఓవర్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కెసి కాలువపై బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వెంటనే ఈ పనులు పూర్తి చేయకపోతే చాపాడు మండలం, ఖాజీపేట మండల పరిధిలోని పలు గ్రామాల రైతులకు నీరు అందడం కష్టతరం. ఈ ప్రాంతంలో కాలువ పనులు చేపట్టకపోతే సుమారుగా 7వేల ఎకరాలకు నీరు చేరే పరిస్థితి లేదు. అలాగే మైదుకూరు పట్టణంలోని వనిపెంట రోడ్డు లోపల కొండపేట కాలువపై బ్రిడ్జి దెబ్బతినడంతో పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం బ్రిడ్జికి సంబంధించి సిమెంట్ కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. చాపాడు మండల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా పలు ఉప కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కెసి కెనాల్ కాలువలో పలు ప్రదేశాల్లో షట్టర్లు పనిచేయడం లేదు. కొన్ని ప్రదేశాల్లో నీరు అధికంగా వృథాగా పోయే పరిస్థితి కనిపిస్తోంది. అంతేకాకుండా కెసి కెనాల్‌కు సంబంధించిన సిబ్బంది కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేరని రైతులు వాపోతున్నారు. 90 మంది లస్కర్లు ఉండాల్సి ఉండగా కేవలం 11 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఎగువ ప్రాంతాల్లో కొంతమంది షట్టర్లను ఇష్టానుసారంగా తిప్పుతున్నట్లు తెలుస్తోంది. కెసి కెనాల్ చివరి ఆయకట్టు వరకు నీరు విడుదలైతే 88వేల ఎకరాలకు నీరు చేరుతుంది. చాపాడు చానల్‌కు నీటి విడుదలకు ఎలాంటి ఆటంకాలు లేవు. ఆ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. మైదుకూరు ప్రధాన కాలువకు మాత్రం కొన్ని రోజులు ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి చివరి ఆయికట్టు వరకు త్వరగా నీటిని విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏటూరు కాలువ వద్ద జరుగుతున్న బ్రిడ్జి పనులు

రిజర్వాయర్లలో నీళ్లున్నా.. చెరువులకు వదలరా?

మరమ్మతులు మమ్మల్ని చేయనివ్వరూ.. వారూ చేయరు : అధికారుల వ్యవహారాన్ని తప్పపట్టిన ఎంపీ

మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

చిత్రావతి, పైడిపాలెం రిజర్వాయర్లలో పుష్కలంగా నీరు ఉన్నా ఆయకట్టు చెరువులకు వదలలేదని, ఇందుకు కారణం అధికారుల నిర్లక్ష్యమేనని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎర్రబెల్లి, భూమయ్యగారిపల్లి చెరువులకు నీళ్ల వదలాలని అధికారులను అడిగితే మోటర్లు పనిచేయలేదని ఒకసారి, ట్రాన్స్‌ఫార్మర్లు పని చేయలేదని మరోసారి సాకులు చెబుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మరమ్మతులు తాము చేయిస్తామంటే చేయ్యనివ్వరూ.. వాళ్లు చేయరు అని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు పులివెందులను హార్టికల్చర్ హబ్ అని చెబుతున్నా అధికారులు మాత్రం చెరువులకు నీళ్ల వదలడం లేదన్నారు. రైతులు సాగునీరు కోసం బోర్లు వేసుకుని లక్షల రూపాయలు ఖర్చు పెట్టుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్ర మేల్కొని చెరువులకు నీరు వదలాలని ఎంపీ కోరారు. ఇరిగేషన్ కార్యాలయనికి వెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో హౌసింగ్ నిర్మాణ పనులపై డిఇ వాసుదేవరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ కిషోర్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, వైసీపీ నాయకులు గంగాధర్ రెడ్డి, బలరామిరెడ్డి, సాంబశివారెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పలువురు ప్రజలు రెవెన్యూ సమస్యలపై ఆర్‌డిఒను కలవడానికి వచ్చారు. ఎంపీ కూడా అక్కడికి రావడంతో అధికారులు ఆరు నెలల నుంచి తిప్పుతున్నారే తప్ప, పనులు చేయడంలేదని ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. ఇందుకు ఎంపీ స్పందిస్తూ ఆర్‌డిఒతో ఫోన్లో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు వారి సమస్యలను ఎంపీకి వివరించారు. సంబంధిత అధికా రులకు ఆయన ఫోన్ చేసి సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు.

అనుమతి ఉన్న ఉత్పత్తులనే విక్రయించాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ డిఎస్‌పి పి.మల్లికార్జునరావు, కర్నూల్ డిఆర్ సి ఏడీఏ సంగు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు ఆయా దుకాణాల్లో రిజిష్టర్లు తనిఖీ చేసి, రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. నాణ్యమైన, అనుమతి కలిగిన వాటిని మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. దుకాణాల్లో పత్రాలులేని వాటిని పరిశీలించి అమ్మకాల నిలుపుదల చేశారు. ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం అనుసరించి వ్యాపార లావాదేవీలు కొనసాగించాలన్నారు. డిబిటి మిషన్ ద్వారా రైతుల వివరాలు నమోదు చేసి రైతులకు ఎరువులు విక్రయించాలన్నారు. ఏడీఏ యస్.వెంకటేశ్వర్లు దుకాణాల్లో ఉన్న స్టాక్ నిల్వలను పరిశీలించారు. అమ్మిన ప్రతి దానికి నగదు బిల్లు అందించి డీలర్ దగ్గర కూడా ఒక బిల్లు ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీత ధరలకు మాత్రమే ఉత్పత్తులను రైతులకు విక్రయించాలన్నారు. జీవి సత్రం షాప్‌లో శ్రీశక్తి ట్రేడర్స్ 3.6 మెట్రిక్ టన్నుల విలువ రూ.52,200 గల సరుకు రికార్డు అప్డేట్ చేయనందున అమ్మకపు నిలుపుదల చేశారు. శ్రీశ్రీనివాస ట్రేడర్స్‌లో 0.762 మెట్రిక్ టన్నుల విలువ రూ.1,22,640 గల సరుకు ఒ-ఫారం చూపకపోవడంతో అమ్మకపు నిలుపుదల చేశారు. శ్రీ వెంకటేశ్వర ఆగ్రో ఏజెన్సీ, తిరుమల ఆగ్రో ఏజెన్సీస్ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు స్టాక్ అప్డేట్ చేయనందున రూ.22,93,893 స్టాక్ విలువకు అమ్మకపు నిలుపుదల చేశారు. కార్యక్రమంలో జేడిఏ టెక్నికల్ ఏఓ యస్ గోవర్ధన్, ఏడిఏ కృష్ణమూర్తి, స్థానిక మండల వ్యవసాయ అధికారి ఈ.బాలగంగాధర్ రెడ్డి, దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కాలి బాటలతో దోమపోటు నివారించొచ్చు

ప్రజాశక్తి - వేంపల్లె

రైతులు వరి పంట సాగులో కాలి బాటలు వేసుకొంటే దోమ పోటును నివారించవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ చంద్ర నాయక్ పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో పొలంపిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జెడిఏ చంద్ర నాయక్ మాట్లాడుతూ రైతులు తమ భూములకు భూసార పరీక్షలు చేయించాలని కోరారు. భూసార పరీక్షలను అనుసరించి పంటలకు ఎరువులు వాడాలని చెప్పారు. పంటలకు అధిక మోతాదులో యూరియా వాడకం వలన చీడపీడలు అధికం కావడం తప్ప, ఎలాంటి ప్రయోజనాలు ఉండవని తెలిపారు. పంట సాగు చేసి ప్రతి రైతు పంటల బీమా చేయించాలన్నారు. పత్తి, వేరుశనగ పంటలో అంతర్ పంటగా కంది పంటను సాగు చేస్తే అదనపు ఆదాయం వస్తుందని సూచించారు. అరటి రైతులు ఎక్కువ మోతాదులో యూరియా వాడితే అరటి గెలలు గాలులకు నేలవాలుతాయని వివరించారు. దిగుబడి కూడా తగ్గుతుందన్నారు. పులివెందుల ఎడిఏ అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా 80 శాతం రాయితీతో డ్రోన్ అందజేస్తామని చెప్పారు. రైతులకు జాయింట్ డైరెక్టర్ చంద్రనాయక్ కంది ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఒ శివశంకర్‌రెడ్డి, ఎఇఒ మల్లికార్జున, విఏఏ వినోద్, రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరు : మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని ముద్దనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య రైతులకు సూచించారు. మంగపట్నం గ్రామంలో బుధవారం వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో మండల వ్యవసాయ ఆధికారి వెంకటకృష్ణారెడ్డి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జొన్నపంటలో కత్తెర పురుగు నివారణకు ఇమామేక్టిన్ బెంజేట్ మందు 0.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులు అవసరం మేరకే ఎరువులు వాడుకోవాలన్నారు. పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరు సంచుల పథకం కింద పంటలు సాగు చేసే రైతులకు ఉచితంగా కందులు, మినుములు, జొన్నలు, రాగి విత్తనాలు అందిస్తామన్నారు. ప్రధాన మంత్రి పసల్ భీమాకు ఈనెల 31వరకు అవకాశం ఉందన్నారు. వరి పంట బీమాకు ఆగస్ట్ 15 వరకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్.రామసుధ, రైతులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : వరి పంట సాగు చేసే రైతులు కాలిబాటలు తీసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు అనిత తెలిపారు. బుధవారం మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు ఎక్కువగా వరి పంటను సాగు చేస్తున్నారన్నారు. వరిని నాటే సమయంలో కొనలు తుంచి నాటాలన్నారు. క్రిమిసంహారక మందులు పిచికారి చేసేటప్పుడు కానీ లేదా ఎరువులు చల్లేటప్పుడు గానీ కాలిబాటలు అనుకూలంగా ఉంటాయన్నారు. పంటకు వెలుతురు, గాలి ప్రసరణ జరిగి పంట కూడా ఆరోగ్యంగా పెరిగి సరైన దిగుబడి వస్తుందన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రైతులకు మండలానికి ఒకటి లేదా రెండు డ్రోన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు నవీన్, రైతులు పాల్గొన్నారు.

చాపాడు : రాయితీ జిప్సంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ దేవీ పద్మలత సూచించారు. వెదురూరు, నరహరిపురం గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రాయితీ జిప్సం అందుబాటులో ఉందన్నారు. 50కిలో బస్తా రూ.179తో అందజేస్తామని తెలిపారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి డిడి తీయాలని సూచించారు. ఎరువులను అన్ని రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచుతామన్నారు. అయ్యవారిపల్లి సచివాలయంలో యూరియా పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో విఎఎ రాము, ఏఫ్‌పిఒ బయన్న, రైతులు కృష్ణారెడ్డి, నూర్ మొహమ్మద్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

వేముల : పంట నమోదు తప్పనిసరి అని వ్యవసాయాధికారులు రైతులకు సూచించారు. దుగ్గన్నగారిపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడి ఎ.చంద్ర నాయక్, ఎడిఎ ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఓబులేసు రైతులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ విత్తన పంపిణీ, యాంత్రీకరణ, బీమా గురించి అవ గాహన కల్పించారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు వర్షభావ పరిస్థి తులను అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ఎరువులు కొరత లేకుండా అందుబాటులో ఉంచుతామన్నారు. భూసార పరీక్షల అనుసరించి ఎరువులు వాడాలని సూచించారు. రైతు సేవ కేంద్రంలో పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నారెడ్డి, ఎఇఒ సురేష్, ఆర్‌ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వేముల : కందులు పంపిణీ చేస్తున్న అధికారులు

పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సామాజిక స్పృహతో మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దామని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మినీ సచివాలయ ఆవరణలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహనా కార్యక్రమంలో భాగంగా ఎంపీ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల మత్తు బారిన పడి అనారోగ్య సమస్యలతో సంసారాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. జీవితాలు నాశనం చేసుకొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువత గంజాయి, పొగాకు వంటి మత్తు పదార్థాలతో ఎదురయ్యే సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, బయపురెడ్డి, బలరాంరెడ్డి, సాంబశివారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నప్ప, హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, రసూల్, చంద్రమౌళి,నూరుల్లా, సేవా సమితి సభ్యులు సురేష్, రాజు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పత్తూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు సయ్యద్ ఖాసిం ఇటీవల పురుగు కాటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి బుధవారం పత్తూరు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందన్నారు. తప్పక న్యాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా జనరల్ సెక్రెటరీ పీవీ రాఘవరెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ భూమన సుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, నాయకులు డిఎల్ శ్రీనివాసుల రెడ్డి, మాజీ ఎంపీటీసీ మనోహర్, మండల యువత అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.

వైసిపి జిల్లా మున్సిపల్ విభాగ కమిటీ కార్యదర్శిగా నిరంజన్‌రెడ్డి

ప్రజాశక్తి - వేముల

వైసిపి కడప జిల్లా మున్సిపల్ విభాగ కమిటీ కార్యదర్శిగా కల్లూరు నిరంజన్‌రెడ్డి నియమితులైనట్లు బుధవారం కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ.. తనపై నమ్మకంతో పదవీ కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డికి, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనునిత్యం పార్టీ కార్యక్రమాల్లో కొనసాగుతానని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

చాపాడు వైస్ ఎంపిపిగా బాలనరసింహారెడ్డి ఎన్నిక

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మండల ఉప మండల అధ్యక్షులుగా చియ్యపాడు ఎంపీటీసీ వైసిపి అభ్యర్థి ఎస్ఆర్ బాల నరసింహారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఎంపిపిగా ఉన్న నగిర్తి సుందరమ్మ అనారోగ్య కారణాలతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె మృతితో ఖాళీ అయిన స్థానానికి అధికారులు ఎన్నిక నిర్వహించారు. పులివెందుల డివిజన్ పంచాయతీ అధికారి విజయలక్ష్మి, ఎంపిడిఒ వీర కిషోర్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. మండల పరిషత్ కార్యాలయ సభ భవనంలో ఉప మండల అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. 9మంది ఎంపీటీసీలు ఏకగ్రీవంగా ఎస్ఆర్ బాలనరసింహారెడ్డిని ఉప మండల అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాలనరసింహ రెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, చాపాడు ఎంపీపీ టి.లక్షుమయ్య యాదవ్, మండల ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏ ఒక్క హామీ సంపూర్ణంగా అమలు కాలేదు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కూటమి ప్రభుత్వంలో వారిచ్చిన ఏ ఒక్క హామీ సంపూర్ణంగా అమలు కాలేదని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఓట్లు వేయించుకొని, అవసరం తీరాక హామీలను గాలికి వదిలేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.

గండి దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన వీరాంజనేయ స్వామివారి దేవస్థాన ఆవరణలో పూలు విక్రయించుట ద్వారా దేవస్థానానికి రూ.20 లక్షల 5 వేలు కత్తులూరి మల్లికార్జున వేలం పాటలో దక్కించుకున్నట్లు ఎసి జె వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. బుధవారం ఉదయం 10.00 గంటలకు ఇ-టెండర్/సీల్డ్ టెండరు, టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించారు. మొదట పూలు విక్రయించుకొను హక్కునకు బహిరంగ వేలం నిర్వహించగా, గత సంవత్సరం కన్నా రూ.90వేలు అదనంగా దేవస్థానానికి ఆదాయం వచ్చింది. టోల్‌గేట్ వసూలు వేలాన్ని నిలిపేశారు. శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పుష్పాలంకరణ చేయు హక్కునకు సంబంధించి సీల్డ్ టెండర్లు ఎవ్వరు కూడా దాఖలు చేయలేదు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి కార్యాలయం నుండి సి.శివయ్య ఇన్‌స్పెక్టర్, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ప్రధాన అర్చకులు వి.కేసరి, ఆలయ సూపరింటెండెంట్ కె.సుభాష్, గండి సిబ్బంది, చక్రాయపేట ఏపిజిబి సిబ్బంది పాల్గొన్నారు. ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఆర్.కె.వ్యాలీ సిఐ ఉలసయ్య బందోబస్తు నిర్వహించారు. తిరిగి మిగిలిన హక్కులు, టోల్‌గేట్ వసూలు చేసుకొను హక్కు శ్రావణమాస ఉత్సవాల్లో ప్రత్యేక పూల అలంకరణ హక్కులకు ఈనెల 23న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

అందరి సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేస్తాం : ఎసి

ఈనెల 25 నుండి శ్రావణమాస ఉత్సవాల ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో పాలకమండలి సభ్యులు కావలి కృష్ణ తేజ, ఎసి జె వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ ఏడా ది 5 శ్రావణ మాస శనివారం ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరి సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్కేవ్యాలీ సిఐ ఉలసయ్య, ఆర్‌టిసి అధికారులు, వైద్యాధికారి డాక్టర్ వాణి, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధానార్చకులు రాజా స్వామి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేయాలన్నదే ఆశయం

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దడంతో పాటు, ప్రజలకు మంచి చేయాలన్నదే తన తపన, లక్ష్యమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలో వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పిడబ్ల్యూడి బంగ్లా వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్‌ను ఎమ్మెల్యే టిడిపి నాయకులతో కలిసి ప్రారంభించారు. ముందుగా ఎంపిడిఒ సభాభవనంలో అగ్రహారం సహకార సంఘం అధ్యక్ష పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. అధ్యక్షుడిగా త్రిపురవరం టిడిపి నాయకులు హరినాథ్‌రెడ్డి, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి మండల అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, మాజీ జెడ్పిటిసి గోవింద్‌రెడ్డి, ఇరగమ్‌రెడ్డి ప్రతాప్ రెడ్డి, నంద్యాల సుబ్బయ్య యాదవ్, రాష్ట్ర ముస్లిం మైనారిటీ నాయకులు కమలాపురం ఫరూక్, ఐటీడీపీ నాయకులు ఏసుపాదం పాల్గొన్నారు.



బస్సు షెల్టర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే